సమస్యల ప్రాంగణం

- మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కరువు
- అత్యవసర వేళలో ఊపిరి బిగబట్టుడే
- చెట్ల కిందే ప్రయాణికుల నిరీక్షణ
- పార్కింగ్‌లకు అడ్డగా బస్టాండ్
- కంట్రోలర్ లేక ప్రయాణికుల పాట్లు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ఆర్టీసీ బస్టాండ్ సమస్యల ప్రాంగణంగా మారింది. ప్రతిరోజూ సుమారు వంద బస్సులు వచ్చి వెళ్లే ఈ బస్టాండ్‌లో అనేక సమస్యలు తిష్టవేశాయి. ప్రయాణికులతో పాటు స్థానికులు సమస్యలపై అనేకసార్లు సంబంధిత ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుపోయిన పరిష్కార మార్గం చూపలేకపోతున్నారు. ఫలితంగా బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు సరైన మరుగుదొడ్లు లేక, కూర్చోవడానికి కనీసం బల్లలు లేక ఊపిరి బిగబట్టి బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని దుస్థితి ఉంది. కంట్రోలర్ లేక బస్సు వేళలు చెప్పేవారు కరువయ్యారు. దీంతో ప్రయాణికులకు ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. జిల్లాలోని మేజర్ మండలమైన ఎల్లారెడ్డిపేటలో ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితిపై ఎవరు స్పందించకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది.



ఎల్లారెడ్డిపేట బస్టాండ్ ప్రాంగణం

ప్రధాన సమస్యలు ఇవే

➡ మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి నిర్వహణ లేక అవి నిరుపయోగంగా తయారయ్యాయి.

➡ ప్రయాణికులకు ఆర్టీసీ ప్రాంగణంలో కనీసం బోరు వేయకపోవడంతో తాగునీటి కోసం అల్లాడుతున్నారు. హోటళ్లలోకి వెళ్లి నీటిని తాగాల్సిన పరిస్థితి ఉంది.

➡ బస్టాండ్‌లో కంట్రోలర్ లేక బస్సుల సమాచారం ఇచ్చే వారు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

➡ బస్టాండ్ ప్రాంగణమంతా పారిశుద్ధ్య లోపంతో కంపుకొడుతోంది. వ్యర్థాలను ప్రజలు ప్రాంగణంలోనే వదిలివెళ్తున్నారు. దీంతో దుర్వాసనతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

➡ బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలను దర్జాగా వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ఆర్టీసీ బస్సులు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది.

చినుకుపడితే చిత్తడే..

బస్టాండ్ ప్రాంగణమంతా చిన్నపాటి వర్షానికి బురద మయంగా మారుతోంది. ప్రాంగణంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో బస్సులు ఒక్కోసారి ప్రాంగణంలోకి రాకుండానే ప్రధాన రహదారిలో వెళ్లిపోతున్నాయి. దీంతో బస్సుల కోసం నిరీక్షించే వారు ప్రాంగణంలోనే ఉండిపోతున్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో సీసీగా మార్చాలని ప్రజలు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. దీంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ కోసం ప్రత్యేకంగా కాంట్రాక్టు పద్ధతిలో కూలీలను నియమించాలని విజ్ఞప్తులు చేసిన పట్టించుకునే వారు కరువయ్యారు. ఆర్టీసీకి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న ఈ బస్టాండ్ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.


నిరుపయోగంగా మరుగుదొడ్డు

ఇబ్బందులు పట్టించుకోవాలి



బస్టాండ్ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. మరుగుదొడ్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలో వ్యర్థాలను వదిలేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ప్రాంగణమంతా బురదమయంగా మారడంతో బస్సులు ఎక్కడం ఇబ్బందవుతోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

– భూక్య ఈరవ్వ, ఎల్లారెడ్డిపేట

త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం



బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న సమస్యలు మా దృష్టికి వచ్చాయి. సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. బస్టాండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. నీటి సమస్యలను పరిష్కరించి మరుగుదొడ్లను అందుబాటులోకి తెస్తాం. కంట్రోలర్‌ను నియమిస్తాం.

– మనోహర్, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

క్లుప్తంగా

మతసామరస్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత


రంజాన్ తోఫాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో మత సామరస్యానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని తడగొండ గ్రామ మదీన మసీద్ పరిసరాల్లో ముస్లింలకు రంజాన్ తోఫా(బట్టల పంపిణీ) చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, తహసీల్దార్ దర్పెల్లి నరేశ్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ చిందం రమేశ్, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, ఎండీ. అహ్మద్‌హుస్సేన్, గుడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గొర్రెలకు బదులు నగదు ఇవ్వాలి


ఆత్మీయ సమ్మేళనంలో యాదవులు

గంభీరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో యాదవులకు గొర్రెలను కాకుండా నగదు బదిలీ చేయాలని యాదవుల జాతీయ హక్కుల పోరాట సమితి అధికార ప్రతినిధి కొక్కు దేవేందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొళ్లమద్దిలో సోమవారం మండల యాదవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యాదవుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఐదువేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. అన్ని గ్రామాల్లో సామూహిక గొర్రెల షెడ్లను నిర్మించాలన్నారు.

డిగ్రీ కళాశాల హామీ ఏమైంది?

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణుల హామీ ఏమైందని సామాజిక ఉద్యమకారుడు సావనపెల్లి రాకేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మారుమూల ప్రాంతం కావడంతో డిగ్రీ చదవాలంటే విద్యార్థులు సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్ళాల్సి వస్తుందని, ఎమ్మెల్యే, జెడ్పీ వైస్‌చైర్మన్ ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

అంధత్వ నివారణే సర్కారు లక్ష్యం

- కంటివెలుగు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: అంధత్వ నివారణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర సర్కారు కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. సోమవారం సిరిసిల్లలోని మూడో వార్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనలో రూపుదిద్దుకున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు వివిధ కంటిజబ్బులకై శిబిరాల్లో ఉచిత చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, గీతానగర్-విద్యానగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస సోమవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జిందం రేఖ, సర్పంచ్ మాట్ల మధు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, మెడికల్ ఆఫీసర్ జిందం రేఖ, ఆర్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొమ్మిటి రాజిరెడ్డి, నేరెళ్ల పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిందం కళ

కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి


ఎంపీపీ చంద్రయ్యకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

కోనరావుపేట: గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పనిచేస్తున్న కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్‌కు సోమవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 ఏప్రిల్ 12న విధుల్లో చేరిన కార్యదర్శులకు ప్రొబేషన్ కాలం ముగిసినప్పటికీ మరో ఏడాదికి పెంచారన్నారు. అట్టి సమయం కూడా ఈ ఏప్రిల్ 11తో ముగిసిందన్నారు. ఇప్పటికైనా కార్యదర్శుల పోస్టులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ సంఘం అధ్యక్షుడు అనిల్, కార్యదర్శులు కవితారెడ్డి, మమత, సుచిత్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతులకు ప్రెస్ అండగా నిలవాలి


ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గసభ్యులతో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రెస్ అండ్ మీడియా అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పుట్టపాక లక్ష్మణ్‌తోపాటు నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సోమవారం ఆయన తన నివాసంలో శాలువాలు కప్పి అభినందించారు. డెమాక్రసీలో ఫోర్త్ పిల్లర్‌గా చెప్పుకునే ప్రెస్ తప్పకుండా ప్రశ్నించే గొంతులకు అండగా నిలుస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో కలిసి బాబుయాదవ్, ప్రశాంత్, మహేశ్, సంపత్, నరేశ్, మల్లేశం, సాయిబాబా, కిషన్, పవన్, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాగారం వెంటకస్వామి, శ్రీనివాస్‌గౌడ్, కనికరపు రాకేశ్, చిలుక రమేశ్, తోట లహరి, పాత సత్యలక్ష్మి, నాగుల విష్ణు, నరేశ్, మెండె రాజు, మామిడాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్

- ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్
- బోయినపల్లి మండల సమావేశం

బోయినపల్లి: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఎంపీపీ వేణుగోపాల్ అధ్యక్షతన బోయినపల్లి మండల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్ హాజరయ్యారు.

➡ నాలుగేళ్లు గడిచినా భగీరథ లీకేజీ పనులు పూర్తిచేయడం లేదని సర్పంచులు చిందం రమేశ్, గుంటి లతశ్రీ, కన్నం మధు అన్నారు.


➡ ఈజీఎస్ కూలీలకు సరైన కూలి లభించడం లేదని లతశ్రీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

➡ క్రీడా ప్రాంగణాల పనులకు సంబంధించిన బిల్లులు రావడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.

➡ గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు, ఎంబీపై ప్రతీ మండల సభలో అడిగినా ఇంజినీరింగ్ అధికారులు స్పందించడం లేదని ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ ఆరోపించారు.

➡ ఈజీఎస్ ఏపీవో సబిత మాట్లాడుతూ మండలంలో 7,952 మందికి జాబ్ కార్డులు ఉన్నాయని, 3,775 మంది కూలీలు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎంఏవో ప్రణిత మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో పంటల నమోదు వివరాలు సభకు వివరించారు. సెస్ ఏఈఈ రాకేశ్‌రెడ్డి లూజ్‌లైన్ల కోసం మంజూరైన పోల్స్ వివరాలు తెలిపారు. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ 'మన ఊరు – మన బడి' అమలు తీరు వివరించారు. వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి, పీఆర్ డీఈ సత్యనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. మండల సమావేశానికి 23 గ్రామాల్లో కేవలం నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు.

తహసీల్దార్‌గా రవికాంత్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రవికాంత్

కోనరావుపేట: మండల తహసీల్దార్‌గా రవికాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కోనరావుపేటలో తహసీల్దార్‌గా పనిచేసిన నరేందర్ ఇల్లంతకుంటకు బదిలీ కాగా, ఇల్లంతకుంటలో పనిచేస్తున్న రవికాంత్‌ను కోనరావుపేటకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం కోనరావుపేటలో డిప్యూటీ తహసీల్దార్ బొబ్బిలి సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ఇల్లంతకుంట తహసీల్దార్‌గా నరేందర్..

ఇల్లంతకుంట: తహసీల్దార్‌గా నరేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రవికాంత్ కోనరావుపేట తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నరేందర్ మాట్లాడుతూ మండల రైతుల భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీలో చేరిక



బోయినపల్లి: మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన శ్రీహరి అనే యువకుడు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరినట్లు నాయకులు కొనుకటి హరీశ్, సారంపల్లి రాజులు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి సూచన మేరకు చేరిక జరిగిందని పేర్కొన్నారు.

సిద్దోగానికి విరాళాలు

చందుర్తి: మండలం మూడపల్లి గ్రామంలో ఈ నెల 24 నుంచి జరిగే శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగానికి దాతలు సోమవారం విరాళాలు అందజేశారు. అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా జరిపించేందుకు గ్రామస్తుల సహకారం ఉంటుందని సర్పంచ్ అంజిబాబుతో పాటు విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్ జేపీ రావులతో పలువురు దాతలు కలిసి సుమారు రూ.1.80 లక్షల వరకు విరాళాలను అందజేశారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.50 వేల చెక్కు అందజేసిన గోలి నర్సయ్య గౌడ సంఘం సభ్యులు సన్మానించారు.

మూడు గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే

కోనరావుపేట: మండలం కొండాపూర్, మర్తనపేట, వెంకట్రావుపేట గ్రామాల్లో చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసే శిబిరంలో వారికి అవసరమైన మందులు, వైద్య సలహాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచులు మల్యాల దేవయ్య, వెన్నమనేని వంశీకృష్ణరావు, సంతోష్, చల్మెడ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీడ్కోలు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భవిష్యత్తును గొప్పగా మలచుకోవాలని వక్తలు కోరారు. ఉన్నత లక్ష్యంతో ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ సంతోష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ 11వ నంబర్ బూత్ కమిటీ

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీజేపీ 11వ నంబర్ బూత్ కమిటీని అధ్యక్షుడు మాడుగుల లింబాద్రి, మండల ప్రధాన కార్యదర్శి పోతారం నరేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పోతారం లింబయ్య, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి భూమయ్య, కార్యదర్శిగా పోతారం లింబవ్వ, సభ్యులుగా శ్రీనివాస్, శంకరయ్య, లింబవ్వ, అనిత, లక్ష్మి, పద్మ, భూదవ్వ, కొమురయ్య, రేణవ్వ, సుమలతను ఎన్నుకున్నారు.

మంత్రి గంగులను పరామర్శించిన నాయకులు

ముస్తాబాద్: ప్రమాదవశాత్తు గాయపడ్డ మంత్రి గంగుల కమలాకర్‌ను ముస్తాబాద్ ప్రజాప్రతినిధులు కరీంనగర్‌లో ఆయన నివాసంలో సోమవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు కాలికి గాయలైన మంత్రి ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, మంత్రి పీఏ చీటి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావు పరామర్శ

ఇల్లంతకుంట: ఇటీవల మృతి చెందిన మండలంలోని దాచారం గ్రామానికి చెందిన సురభి ఆనందరావు కుటుంబ సభ్యులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం సాయంత్రం పరామర్శించారు. ఆనందరావు చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులున్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం


పోలీసుల అదుపులో ఉన్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో మంత్రి కేటీఆర్ పర్యటన ఉన్న ప్రతిసారి బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీజేవైఎం మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అన్నారు. మంత్రి పర్యటనను పురస్కరించుకొని నాయకులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మంత్రి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రశ్నించే గొంతులను నొక్కి వేస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజలను మోసం చేసే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ నాయకులు రవీందర్‌నాయక్, కిరణ్‌నాయక్, స్వామి ఉన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామంలో బూత్ స్వశక్తి కరన్ అభియాన్‌లో భాగంగా బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిమల్ల బీజేపి బూత్ అధ్యక్షుడు బండారి మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పీర్యా, గోవర్దన్, చెంద్రశేఖర్, మహేష్, అంజి, చెంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

సిరిసిల్లఅర్బన్: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. విద్యార్థులు ఉచిత కోచింగ్‌ని సద్వినియోగం చేసుకోని ఉద్యోగాలు సాధించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ ఆకాంక్షించారు. నాయకులు ఇల్లందు ప్రకాశ్, రుద్రవేణి సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎంపీటీసీ సొల్ల లలిత సోమవారం ఫిర్యాదు చేశారు. మిషన్ భగిరథ ద్వారా ఆవునూర్‌లో నల్లా నీటి కనెక్షన్లు ఇవ్వలేదని, పైపులైన్లు కూడా వేయలేదన్నారు. ప్రస్తుత వేసవిలో ఇళ్లలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడేళ్లుగా ఈ విషయంపై ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చందుర్తి: మండల కేంద్రంలోని పెరుక కమ్యూనిటీ భవనంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని 11 మంది లబ్దిదారులకు రూ.2.15 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, కేడీసీసీ డైరెక్టర్, సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు జలగం కిషన్‌రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్ , సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో..

రుద్రంగి: మండల కేంద్రానికి చెందిన 8 మంది లబ్దిదారులకు రూ.1,29,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయకులు గంగం మహేశ్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత

వీర్నపల్లి: మండలం కంచర్ల గ్రామంలో క్రీడాకారులకు వాలీబాల్ కిట్టును ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, స్థానిక సర్పంచ్ రజిత సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు వీటూరి సతీశ్, జక్కుల నరేశ్, సాగర్, అనిల్, అజయ్, అనాల్, రాజశేకర్, బాలు పాల్గొన్నారు.

పరామర్శ

ముస్తాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముస్తాబాద్‌కు చెందిన బీజేపీ కార్యకర్త కంచం నవీన్ కుటుంబాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి సోమవారం పరామర్శించారు. పార్టీపరంగా కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అలాగే ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి కూడా నవీన్ కుటుంబాన్ని పరామర్శించి, ఆయన తల్లిదండ్రులను ఓదార్చారు. పుట్నాల మల్లయ్య అనే వృద్ధుడు మృతి చెందగా ఆయన కుటుంబీకులను పరామర్శించారు.